# అసమర్థత

నిజానికి నేను రాస్తున్నది అంత వింత అయినది కాని, విషాదకరమైనది కాని కాదు - ఎందుచేతనంటే మనం ఎన్నో వింటూనే ఉంటాం ప్రతిరోజూ - రైళ్ళు తిరగబడి ఎంతోమంది చనిపోయేరనీ, వరదలవల్ల ఎంతో ధన జన నష్టం సంభవించిందని భూకంపాలవల్ల, యుద్ధాల మూలంగాను ఊహించలేనంత ప్రాణనష్టం సంభవిస్తున్నదనీను.

ఇలాంటి వార్తలు వినడంవల్ల మనకేమీ అనిపించదు. "ఆహా, అలాగా?" అని ఒక్కమారు ఆశ్చర్యం ప్రకటించి ఊరుకొంటాం. కాని, మన కళ్ళముందు కారుకింద కుక్కపిల్లపడి చచ్చిపోయిందంటే లేకపోతే మూర్ఛవచ్చి మనిషి రోడ్డుమీద పడి కొట్టుకొంటూఉంటే, అంత నిర్లిప్తంగా ఉండలేం - ఏదో గాఢమైన అనుభవం పొందుతాం. ఈ వార్త కనబడ్డవాళ్ళందరితోనూ చెప్తాం. వాళ్ళుమాత్రం "ఆహా, అలాగా?" అని ఊరుకొంటారు.

మొదట ఆ యింట్లో ప్రవేశించగానే "ఊరితో సంబంధం లేకుండా ఒంటరిగా ఉండవలసి వచ్చిందే" అనిపించింది. అయితే, అటువంటి భయం అనవసరమనిపించింది రంగడు దగ్గరలోనే ఉంటున్నాడని తెలిసి. ఒంటరిగా ఉన్నానన్న బెంగే లేకపోతే రంగడి మంచిచెడ్డలు తెలుసుకోవలసిన అవసరమే కలిగిఉండదు నాకు.

గ్రామంలో రంగడంటే అందరికీ తెలుసును. మొండిరంగడంటే మరీ సులువుగా తెలుస్తుంది. రంగణ్ణిగురించి చెప్పుకొని నవ్వుకోందికి చాలా విషయాలున్నాయి. ప్రేమకలాపాల విషయంలో రంగడి శక్తిసామర్థ్యాలు అద్వితీయమైనవి. ఆరేసి మాసాలకొకమారు భార్యని బదలాయించెయ్యడం రంగడికి అతి సాధారణ విషయం. ప్రస్తుతం నాలుగు మాసాల గర్భవతి అతని భార్యస్థానాన్ని ఆక్రమించుకొని ఉంది.

రంగడితో ఉన్న అవసరం అంతా గ్రామంలోని చిల్లరవర్తకులకి. ఆజానుబాహువు - మంచి కండపుష్టి ఉంది. ఎంతలావు సామానైనా అవలీలగా నమ్మకంగా అనుకొన్న స్థలానికి చేరవేస్తాడని అందరి విశ్వాసం. రంగడితో కూలిబేరం చేయడం అంటూ లేదు. రంగడిచేత గాడిద పని చేయించుకోవచ్చును, మంచిమీద. తిక్క పుట్టిందంటేమాత్రం వాడిచేత ఏమీ చేయించలేరు. ఈ సంగతికూడా అందరికీ తెలుసును.

## ప్రణవానంద

చుట్టుపక్కల ఊళ్ళన్నీ డ్యూటీపేరుతో చాంద్రాయణం చేసి, సాయంకాలానికి ఇంటికి చేరుకోడం నా అలవాటు. ఆ సమయంలో ఆరుబయట మంచం వాల్చుకొని రంగడు సతీసమేతంగా కూర్చొనేవాడు. ఒక్కొక్కనాడు భరించలేనంత రాగాలాపన వినిపిస్తూఉండేది. రంగడికి దాపరికమంటూ లేదు. కాగా, భార్యాభర్తల సరస సల్లాపాలు వినే యోగం దగ్గరగా ఉండడంచేత నాకు తప్పేదికాదు.

రోజూ ఒకమారు రాత్రి నా దగ్గరకు వచ్చేవాడు. చుట్ట, అగ్గిపెట్టె, ఒక కానీ డబ్బులో ఏదో అడిగేవాడు. వెళుతూ ఒకమారు అవసరమైతే కేక వేయండి బాబూ ఇక్కడే ఉంటానుకదూ అనేవాడు.

అమధ్య ఒక వారంరోజులు గ్రామంలో లేను. తిరిగి వచ్చేసరికి రంగడు కనిపించేడు.

మనిషి బాగా నీరసించిపోయాడు. నన్ను చూడగానే ఎంతో ఆప్యాయత కనబరిచేడు. నాకూ అలాగే అనిపించింది. ఎక్కువ సంబంధం లేకపోయినా పరస్పరం ఈ ఆత్మీయత ఎలా కలిగిందో చెప్పలేను. ఎన్నో కారణాలు చెప్పుకొని మనం తృప్తి పడవచ్చును. కాని, ఆ కారణాలు చాలా చోట్ల అన్వయించబడుతాయి.

ఏమలా ఉన్నావని అడిగేను.

"బాబూ! నాలుగు రోజులయింది, నులిగడుపుగా ఉంది. కూలికి ఎక్కడికీ పోలేదు" అన్నాడు.

"మాకు మందేటిబాబూ! అదే పోతాది" అన్నాడు.

జబ్బుచేస్తే మందు పుచ్చుకోడం అన్నది ఆ ప్రకృతులకి అంత అలవాటయిన సంగతి కాదు; అదికాక, మందుపుచ్చుకోవాలంటే అంత సులువయినవిషయమూ కాదు.

ఊళ్ళో వైద్యుడు వెంకట్రాయడుగారు లేకపోలేదుగాని కూలినాలిచేసుకొనేవాళ్ళకి వైద్యంచేస్తే ఎలాగడుస్తుంది ఆయనబ్రతుకు! వాళ్ళకి శ్రద్ధలేదు, తక్కినవారు పట్టించుకోరు.

నులిగడుపు (డిసెంట్రీ) ఏమంత పెద్ద జబ్బేమీ కాదు. ఇలాంటి చిల్లరజబ్బులకి ఏఏమందులిస్తారో నాకు తెలుసును. అవి ఏమంత ఖరీదయినమందులు కావు కూడాను. ఆమాత్రం మందులు నేను కొని ఇవ్వగలను. కాని, నేను డాక్టరుని కాదు - తీరా మనం తెలిసీ తెలియకుండా మందిస్తే అది ఏమైనా వికటిస్తుందేమో? ఇంతకీ రంగడు చెప్పినట్టు దానంతటదే పోవచ్చును. ఇంతకంటే మరే విధంగానూ ఆలోచించలేకపోయాను.

"తిండి తిన్నావా?" అని అడిగేను.

"తిన్నాను బాబూ!" అన్నాడు అనుమానంగా.

రంగడు వెళ్ళిపోయినతరవాత జబ్బులూ, మందులూ, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్యసహాయమూ, ప్రజలఅజ్ఞానమూ మొదలయిన విషయాలు ఎంతోసేపు మనస్సులో మెదిలేయి

తరవాత మర్నాటి కార్యక్రమానికి అన్నీ సర్దుకోవలసిరావడంమూలాన నా గొడవలో నేను పడిపోయేను.

ఆవేళ సాయంత్రం ఇంటికి వచ్చి కొంత విశ్రాంతిగా కూర్చున్నాను పేపరు చదువుకొంటూ.

దగ్గరలోనే కేకలు వినిపించాయి.

"కాలూ చెయ్యీ గట్టిగా ఉన్నప్పుడు మేం కనిపించేమా? మా కోనాడైనా ఇంత గంజి పోసినావా? ఇప్పుడు నీ కళ్ళకి మేం కనిపించినాము; ఇప్పుడు మేం చెయ్యాల— ఊరుముండల్నందర్నీ తెచ్చినావు, అళ్ళకేటి కావాల? తిండి పెట్టినంతకాలం ఉంటారు. అది నేకపోతే ఎవురిదారి వారిది - దానిదేమీ తప్పుకాదు - నిన్నే అనాల"—

---

నా డైరీని. కళ ఊఁకొడ్తూనే జోకొట్టేస్తుంది...బిచ్చగాడినీ, లక్షాధికారినీ పక్షపాతంలేకుండా తన ఒడిలోకి తీసుకొని వాళ్ళ కాగోజిచ్చిన బొబ్బలకు మందురాసి మాన్పే నిద్రాదేవత ఒడిలోకి. నా నిరుద్యోగజీవితం ఒక విషాదగీతం. కాని విషాదగీతం 'రాజా' పాడితే బాగుండదూ? ★

# అసమర్థత

రంగడి అక్క అప్పమ్మ ఎన్నాళ్లనుంచో ఈమాటలు అనదలచుకొని ఉంది. ఈ సదవకాశాన్ని అప్పమ్మ జారవిడవలేదు. జబ్బుతో తీసుకుంటూ ఖాళీచేసుకోలేని స్థితిలో ఉన్న తమ్ముణ్ని వదలి వెళ్లిపోయిన మరదలు చేసిన పని అప్పమ్మకి కొంత ఆనందం కూడా కలిగించింది.

"సల్ఫాగనోడిన్ మాత్రలిస్తే?" ఏమో, ఏం ప్రమాదం చేస్తాయో? ఇంతకీ అవి గుండెని నీరసపెడతాయట. డిసెంట్రీకి సల్ఫాగనోడిన్ మాత్రలు ఇవ్వడం నాకు తెలుసును. అయినా నేనెలా ధైర్యం చేసి ఇవ్వడం? పట్నం వెళ్లినప్పుడు డాక్టర్నడిగి మందు తీసుకొని వద్దామనుకున్నాను.

మర్నాడు రోడ్డుమీద రంగడు కనిపించేడు. మనిషిని పోల్చుకోలేకపోయాను. నడిచే స్థితి దాటిపోయింది. కూర్చునే దేకురుతూ కనిపించేడు. నేను కనిపించగానే దండం పెట్టేడు. ఎంతలో ఎంత దైన్యం వచ్చేసింది!

ఎక్కువగా మాట్లాడలేకపోయాను. ఏదో తప్పుచేస్తున్నట్టనిపించింది. ఇంట్లో ఏమీ లేదు, చేసిపెట్టేవారూ లేరు. ఈ యింటికీ ఆ యింటికీ అలా దేకురుకుంటూ పోయి, ఎవరేది పెడితే అది తినడం మొదలుపెట్టేడు. అందరికీ నిశ్చయమయిపోయింది రంగ డెలాగూ బతకడని. అందుచేత దొరికింది తినడమే మంచిదన్నారు కూడాను.

రంగణ్ణి చూడగానే జ్ఞాపకం వచ్చింది మందుసంగతి. నేను పట్నం వెళ్ళకపోలేను, వెళ్ళేను అయినా టైములేకపోయింది.

ఆవేళ రాత్రి నాదగ్గరకు వచ్చేడు దేకురుతూనే. "బాబూ! ఏమైనా తినడానికి పెట్టం" డన్నాడు –

నాకు ఎంతో బాధ అనిపించింది. వాడికి కావలసినవి పెట్టడానికి నాకేమీ అభ్యంతరం లేదు –

"భోజనం చేస్తావా?" అని అడిగేను.

"బాబూ! ఇంత ఊరగాయ అన్నం పెట్టించండి"

నిజమే, వాడికి ఇటువంటప్పుడు ఏది పడితే అది తినాలని ఉంటుంది. అయినా ఊరగాయఅన్నం ఎలా పెట్టడం? చేజేతులా జబ్బు ఎక్కువచేయడం ఎలాగ?

"రంగడూ! ఇవాళ ఊరగాయ అన్నం తినకు – తరవాత నీకు కావలసినంత పెడతాను" అన్నాను – చిన్నపిల్లల్ని బుజ్జగించి చెప్పేపరిస్థితి తటస్థించింది.

నీకు మందు తీసుకొనివస్తాను. రెండు రోజుల్లో పోతుంది. తరవాత నీయిష్టం వచ్చినవి తినవచ్చునన్నాను.

కాఫీ చేసి ఇచ్చాను.

తరవాత కాఫీకబ్బులగురించి పిండివంటలగురించి ఎంతో సేపు మాట్లాడుకున్నాం. రంగడు మాటల్లో ఇడ్లీలు, దోసెలు, గారెలు అన్నీ తిన్నాడు. ఏమైనా ఊరగాయఅన్నం తింటేనే మజా... అలా అలా చాలా సేపు పాకకళగురించి ఎంతో ఉత్సాహంతో మాట్లాడేను. ఏఏ కూరలు ఎలా వండుతారో చెప్పేను. ఈబాతాఖానీ వాడికి చాలా సంతోషం కలిగించిఉండాలి.

మళ్ళీ మన ప్రారబ్ధం మనం అనుభవించక తప్పదుకదా! ఇంటిదగ్గరనుంచి టెలిగ్రాం వచ్చింది. అక్కడ పురిటిరోజులు. తక్షణం బయలుదేరేను. అనవసరంగా గాభరా పడ్డాను. అంతా సవ్యంగానే నడిచింది.

ఊరుదగ్గరకి తిరిగిరాగానే రంగడి మందుమాట జ్ఞాపకం వచ్చింది. ఇంతవరకు ఆ ఆలోచనే లేకపోయింది. ఇప్పుడేం చెయ్యడం? బహుశః ఈపాటికి తగ్గిపోయి ఉంటుంది.

తరవాత తెలిసింది. రెండు రోజులయిందిట రంగడు పోయి. వాడి అక్క అప్పమ్మ చెప్పింది. "ఉంటే ఏటి, లేకపోతే ఏటి బాబూ! మాలాటివోళ్లు" అంది యథార్థవాది అప్పమ్మ—అంతటి యథార్థాన్ని భరించగలిగే శక్తి నాకుండవద్దూ?

ఇప్పటికీ నాకు అనిపిస్తూనే ఉంటుంది, మొదట్లోనే సల్ఫాగనోడిన్ మాత్రలు ఇస్తే ఇలా జరిగిఉండకపోయేదేమోనని. కాని, నేనెలా ఇవ్వగలను? నావంటి అసమర్థుల పని ఎప్పుడూ ఇదే పద్ధతి – అన్నీ అనుకోడం. సకాలంలో ఏదీ చెయ్యలేకపోవడమూను.

★


# రెండు మహానగరాలు

మూలం: చార్లెస్ డికెన్సు

అనువాదకులు:

## శ్రీ తెన్నేటి సూరి

అది ఒక వైభవోజ్జ్వల మహాయుగం—వల్లకాటి అధ్వాన్న శకం; వెల్లి విరిసిన విజ్ఞానం—బ్రహ్మ జెముడులా అజ్ఞానం; ఆశాకుసుమాలు పుష్పించిన ఆమధురవసంతం—నైరాశ్యపు చలిగుబుళ్లు యీచుకున్న శిశిరాస్యం; సర్వసంపత్సమృద్ధి—సర్వతోముఖ క్షామం; సూక్ష్మంగా చెప్పాలంటే—నేటి పరిస్థితికి నకలుగా వుందినాటి పరిస్థితి.

అలాంటి కల్లోలదినాలలో లండన్ పారిస్ నగరాలను రెంటినీ పెనవేసుకుని సాగిన ప్రణయబలిదాన గాథ: ఆంగ్ల నవలా ప్రపంచ నిర్మాత చార్లెస్ డికెన్సు ప్రతిభా సంపత్తులు వెల్లివిరిసిపోయిన ''టేల్ ఆఫ్ టూ సిటీస్'' అనే 'క్లాసికల్' నవలకు అనువాదం.

**ఆంధ్రగ్రంథమాల, మదరాసు-1.**